క్లుప్తంగా

ఆత్మీయ కలయిక

భీమవరం(ప్రకాశం చౌక్): మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడే యుగంధర్ కలిశారు. పట్టణంలో నెలకొన్న పరిస్థితులు, పార్టీ శ్రేణులు పడుతున్న ఇబ్బందులను అధినేత దృష్టికి తీసుకెళ్లారు. కొంతకాలం ఓపిక పట్టాలని అధినేత జగన్ సూచించినట్లు నాయకులు తెలిపారు.

శ్రీ కాకతీయ మెరిట్ స్కూల్‌కు స్టేట్ బోర్డ్ స్కూల్స్‌లో గుర్తింపు



హైదరాబాద్‌లో అవార్డునందుకుంటున్న కృష్ణకిషోర్

భీమవరం: భీమవరం పట్టణంలోని శ్రీ కాకతీయ మెరిట్ స్కూల్ ఆంధ్రప్రదేశ్‌లోని టాప్ 25 స్టేట్ బోర్డ్ స్కూల్స్‌లో ఒకటిగా గుర్తింపు పొందింది. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఎడ్యుకేషన్ కన్సల్టింగ్ సంస్థ బ్రెయిన్‌ఫీడ్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందజేసినట్లు స్కూల్ కరస్పాండెంట్ అక్కినేని కృష్ణకిషోర్ శుక్రవారం తెలిపారు. ఉత్తమ అకడమిక్ ఎక్సలెన్స్ స్కూల్, ఇన్నోవేటివ్ ప్రాక్టీసెస్‌లో ఎక్సలెన్స్, బెస్ట్ ఇన్‌ఫ్లుయన్షియల్ స్కూల్ బ్రాండ్ విభాగాల్లో శ్రీ కాకతీయ మెరిట్ స్కూల్‌ను అగ్రగామి సంస్థగా గుర్తించిందన్నారు. ఈసందర్భంగా కృష్ణకిషోర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే మా నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తున్న ప్రతిష్టాత్మక అవార్డును అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.

హోంగార్డ్స్ సేవలు ప్రశంసనీయం



హోంగార్డ్స్‌కు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: శాంతి భద్రతల పరిరక్షణలో హోంగార్డ్స్ సేవలు ప్రశంసనీయమని హోంగార్డుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. శుక్రవారం హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా భీమవరంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వలంటీర్ వ్యవస్థగా ఏర్పాటైన హోంగార్డు వ్యవస్థ ప్రస్తుతం పోలీసు శాఖలో కీలకంగా మారిందని, హోంగార్డులు పోలీసుశాఖలో అంతర్భాగంగా పోలీసులతో సమానంగా సేవలందిస్తుండడం అభినందనీయమన్నారు. జిల్లాలో పోలీసులతో పాటు హోంగార్డుల సంక్షేమం కోసం పలు చర్యలు చేపట్టామని పోలీసుశాఖ ప్రతిష్ట మరింత పెరిగేలా సమిష్టిగా క్రమశిక్షణతో పనిచేయాలని అద్నాన్ నయీం అస్మి అన్నారు. ఈ సందర్భంగా పలువురు హోంగార్డులు జిల్లాలో హోంగార్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేయాలని కోరడంతో తక్షణం స్పందించి దానికి చర్యలు తీసుకోవాలని జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎంవీవీ సత్యనారాయణను ఆదేశించారు. అలాగే బందోబస్తుకు వేరే జిల్లాలకు వెళ్లేటప్పుడు బస్సు లేదా ట్రైన్ వారెంట్స్ మంజూరుకు అంగీకరించారు. ఈ సందర్భంగా విధుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన హోంగార్డులకు ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) వి భీమారావు, జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎంవీవీ సత్యనారాయణ, తాడేపల్లిగూడెం డీఎస్పీ డి విశ్వనాథ్, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి పుల్లారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ దేశింశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫేర్‌వెల్ డే

పాలకొల్లు సెంట్రల్: ప్రతి విద్యార్థీ క్రమశిక్షణతో తమ విద్యాభ్యాసం ముగించుకుని ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడి చదువుకున్న కళాశాలకు మంచి పేరుప్రఖ్యాతలు తీసుకురావాలని పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ మల్లికార్జునశర్మ అన్నారు. శుక్రవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు వీడ్కోలు సభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లికార్జునరావు మాట్లాడుతూ ముఖ్యంగా విద్యార్థులు దుర్వ్యశనాలకు దూరంగా ఉండాలన్నారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళిలర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి, పూర్వ విద్యార్థుల సంఘ నాయకులు డాక్టర్ ఎస్వీ రంగారావు, కార్మూరి రామలింగేశ్వరరావు, సి.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

పాలకొల్లు అర్బన్: ఏఎన్ఎం, ఆశ వర్కర్లు ప్రతి శుక్రవారం మురికివాడల్లో ప్రతి ఇంటికీ తిరిగి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు కోరారు. డ్రైడేలో భాగంగా శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్, ఎమ్మార్వో కార్యాలయం వీధి, కబేళా ప్రాంతాల్లో మహేశ్వరరావు పర్యటించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. డ్రమ్ములు, కొబ్బరి బొండాలు, పాత టైర్లు, డ్రెయినేజీలను పరిశీలించారు.

అంగన్‌వాడీలకు సొంత గూడు కరువు

- పూర్తికాని అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు
- రేకుల షెడ్డులో నిర్వహణ



మొగల్లులో పాడైన పెంకుటి ఇంట్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

పాలకోడేరు: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత గూడు కరువైంది. ఇరుకు గదులు, అద్దె గదుల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నరు. చాలా చోట్ల గాలి వెలుతురు లేని రేకుల షెడ్ల అద్దె గదుల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. కొన్నిచోట్ల కమ్యూనిటీ హాల్, పూర్వ పెంకుటిళ్లల్లో నిర్వహిస్తున్నారు. అయితే అంగన్‌వాడీ కేంద్రాలు ఇంటిని మరిపించాలని, అమ్మ ఒడిని తలపించాలని పాలకులు అధికారులు చెబుతున్నా మాటల నీటి మూటలుగా మిగులుతున్నాయి. వసతులు లేని ఈ కేంద్రాలకు చిన్నారులు వెళ్లడం మానేశారు. ఈ దారుణ పరిస్థితికి నియోజకవర్గంలోని కొన్ని కేంద్రాలే నిదర్శనం. ఉండి నియోజకవర్గంలో పలు అంగన్‌వాడీ కేంద్రాలకు భవన వసతి లేకపోవడంతో చిన్నారులు బాలింతలు గర్భిణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇదీ పరిస్థితి

ఉండి నియోజకవర్గంలో కాళ్ల, ఆకివీడు, పాలకోడేరు, ఉండి మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో మొత్తం 261 అంగన్‌వాడీ కేంద్రాలకు గానూ 16 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 87 సొంత భవనాలు ఉండగా 101 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మిగిలిన అంగనవాడి కేంద్రాలు పాఠశాలల్లో కొనసాగుతున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తారు. ఐదేళ్ల లోపు చిన్నారుల పౌష్టికాహార లేమి నివారణకు, పూర్వ ప్రాథమిక విద్యకు, వీటితో పాటు గర్భిణుల్లో, మాతా శిశువుల్లో రక్తహీనత ను నివారించేందుకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తూ అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన అంగన్‌వాడీ కేంద్రాలకు వసతులను సమకూర్చడంలో ప్రభుత్వాలు అలసత్వం వహిస్తున్నాయి. అప్పుడప్పుడూ సొంత భవనాలు నిర్మించేందుకు మండల పరిషత్‌లు నిధులు విడుదల చేస్తుంటాయి అయితే వాటిని సకాలంలో పూర్తి చేయకపోయినా, అధికారులు పర్యవేక్షణ లోపం వల్ల ఏళ్ల తరబడి నిర్మాణాలు నత్తనడకన సాగుతుంటాయి..

విద్యకు దూరమైన చిన్నారులు

నియోజకవర్గంలో నాలుగు మండలాల్లోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులు లేని రేకుల షెడ్డులో, పాడైన పెంకుటిల్లు, శిథిలావస్థకు చేరుకున్న కమ్యూనిటీ భవనాల్లో నిర్వహిస్తుండడంతో ఉక్కబోతను తట్టుకోలేక కొంతమంది చిన్నారులు కేంద్రానికి రావడం మానేశారు. దీంతో చిన్నారులు విద్యకు దూరమయ్యారు.10 మందితో నడుస్తున్న కేంద్ర నిర్వహణకు నెలకు 3 వేలు రూపాయలు వెచ్చిస్తున్నారు. ఐసీడీఎస్ నుంచి రూ.2,000 వెచ్చిస్తున్నారు. కార్యకర్త, ఆయా తమ చేతి నుంచి వెయ్యి పైగా నెలనెలా భరిస్తున్నారు.

ముందుకు కదలని భవన నిర్మాణాలు

కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలైనా అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు నోచుకోవడం లేదు. గత ప్రభుత్వంలో నియోజకవర్గంలో నాడు–నేడులో భాగంగా అనేక కొత్త భవనాలు నిర్మించారు.

చర్యలు తీసుకుంటాం

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో విస్సాకోడేరు, బొండాడ పేట మహదేవ్ పట్నం, కుప్పనపూడి తదితర గ్రామాల్లో నిర్మాణాలు చివరి దశకు చేరుకున్నాయి. 15 రోజుల్లో నిర్మాణాలు పూర్తి చేస్తాం. భవనాల్లో కొనసాగే కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తితే వెంటనే వేరే భవనాల్లోకి మార్చే చర్యలు తీసుకుంటున్నాం.

– వాణి విజయరత్నం,
సీడీపీఓ, ఆకివీడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్

పాలకోడేరు మండలం విస్సాకోడేరు, కాళ్ల మండలం బొండాడ పేట, ఉండి మండలం మహాదేవపట్నం, ఆకివీడు మండలంలోని కుప్పనపూడి గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణాలకు గత ప్రభుత్వంలో రూ.12 లక్షలు నిధులు మంజూరు అయ్యాయి. నిర్మాణ పనులు ప్రారంభించిన ఎన్నికల సమయానికి చివరి దశ వరకు పూర్తి ఏశారు. అయితే తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం ఆరు నెలలైనా చివరిదశలో ఉన్న భవన నిర్మాణాలను పూర్తి చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను పూర్తి చేయించి భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



పెన్నాడలో అంగన్‌వాడీ కేంద్రం దుస్థితి



మొగల్లు అరుంధతి కాలనీలో పాడైన కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

దళిత క్రైస్తవులను ఎస్సీలుగానే గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న క్రాంతిబాబు

భీమవరం: సమాజంలో మతం మారినంతమాత్రాన కుల వివక్ష, అంటరానితనం పోదని దళిత క్రైస్తవులను ఎస్సీలుగానే గుర్తించాలని కెవిపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె క్రాంతిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మూడవ పర్యాయం అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం మతోన్మాద విధానాలను శరవేగంగా అమలు చేస్తోందని విమర్శించారు. రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తూ హక్కులను కాలరాసేలా చట్టాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. దళితులు ఏ మతంలో ఉన్నా కుల వివక్ష, అంటరానితనం ఎదుర్కొంటారని అందువల్ల దళిత క్రైస్తవులను ఎస్సీలుగానే గుర్తించాలని క్రాంతిబాబు డిమాండ్ చేశారు. దళిత మహాసభ, దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చింతపల్లి గురుప్రసాద్, గంటా సుందర కుమార్ మాట్లాడుతూ సమాజంలో అసమానతలపై దళితులందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం ప్రమాదంలో ఉందని దానిని కాపాడుకోవాలన్నారు. మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి కటికితల రాజారావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి వాసుదేవరావు మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై నేటికీ కులదురహంకార హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులకు రక్షణగా ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బత్తుల విజయకుమార్ అధ్యక్షతన వహించగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లిపూడి ఆంజనేయులు, ఏపీ బహుజన జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కోనా జోసెఫ్, పట్టణ పౌర సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎం వైకుంటరావు, రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గాతల జేమ్స్ పాల్గొన్నారు.

మిల్లుల ఎంపికలో రైతుకే పూర్తి స్వేచ్ఛ



రైతులతో మాట్లాడుతున్న జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి

పాలకోడేరు: మండలంలోని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి శుక్రవారం పర్యటించారు. పాలకోడేరు గ్రామంలో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. శృంగవృక్షం ఎస్వీఎస్ రైసు మిల్లును రాహుల్‌కుమార్ రెడ్డి తనిఖీ చేశారు. ధాన్యం తీసుకువచ్చిన రైతులతో మాట్లాడి, ధాన్యం తూకం వేసే మెషీన్లను పరిశీలించి ఒక బస్తాను తూకం వేసి చూశారు. కొంత ధాన్యం వేసి తేమశాతాన్ని స్వయంగా పరిశీలించారు. రైసు మిల్లు రిజిస్టర్లు, కంప్యూటర్ డేటాను పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతులు తమకు నచ్చిన మిల్లలకు ధాన్యాన్ని తోలవచ్చని, రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని కాలయాపన చేయకుండా అన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటలలోపుగా వారి ఖాతాలకు సొమ్ము జమచేసే విధంగా చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. రైతులు సమీప రైతు సేవా కేంద్రాన్ని సంప్రదిస్తే ధాన్యం కొనుగోలు కేంద్రంలో పని చేసే సిబ్బంది స్వయంగా కల్లాల వద్దకు వచ్చి ధాన్యాన్ని కోరిన రైసు మిల్లుకు తరలిస్తామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం దెయ్యాలతిప్ప గ్రామానికి చెందిన పోతురాజు తాతారావు (42) తన భార్య గల్ఫ్ ప్రయాణానికి సిద్ధం కావడంతో ఈ నెల 3న చేపల చెరువులో వాడే పురుగు మందు సేవించాడు. తాతారావును భీమవరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తాతారావు మృతి చెందాడు. కుమారుడు పోతురాజు నందకిషోర్ ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై ఐ. వీర్రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి



సైన్స్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న దుంపగడప ఎంపీపీ స్కూల్ విద్యార్థులు

ఆకివీడు: విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకుని, విద్యతో పాటు ప్రయోగాలపై ఆసక్తి పెంచుకుంటే భవిష్యత్ శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ కళాశాలలోని భౌతిక శాస్త్రం, రసాయనక శాస్త్రం ల్యాబ్‌లను మండలంలోని తొమ్మిది, పదో తరగతి విద్యార్థులు రెండవ రోజు శుక్రవారం సందర్శించి, పరిశీలించి, ప్రయోగాలను తిలకించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచే శాస్త్రవేత్తలు పుట్టుకురావాలంటే శాస్త్ర సాంకేతిక విద్యలో విద్యార్థులు నిరంతరం నైపుణ్యం సాధించాలని సూచించారు. తరగతివిద్యతోపాటు ప్రయోగశాల విద్య విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానాన్ని పెంపొందిస్తుందన్నారు. ఓగేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం



హోమం చేస్తున్న ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ నేరెళ్ల రామకృష్ణ దంపతులు

ఆకివీడు: సుబ్రహ్మణ్యేశ్వరుడి షష్ఠి సందర్భంగా స్థానిక ఆనాల చెరువు వద్ద ఉన్న వల్లీ దేవ సేన సమేత కల్యాణ సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయంలో ఐదు రోజుల ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయం వద్ద గోపూజ, విఘ్నేశ్వరపూజ, అవపోశన, బలిహారణ, హోమం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ నేరెళ్ల రామకృష్ణ, ప్రవీణ దంపతులు హోమ క్రతువులో పాల్గొన్నారు. సాయంత్రం ఆరు గంటలకు సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం 18 మంది దంపతులతో వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి పట్టు వస్త్రాలను కంభంపాటి సూర్యకుమారి కుటుంబికులు అందజేశారు. శనివారం షష్ఠి ఉత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కిమిడి అరుణకుమారి, అభివృద్ధికమిటీ ప్రతినిధులు మోరా జ్యోతి శ్రీనివాసరెడ్డి, మన్నే పోతరాజు, మోటు పల్లి రామకృష్ణ, కిమిడి నాగరాజు పాల్గొన్నారు.

వీరవాసరం: మండలంలోని తోలేరులో శ్రీ వల్లి దేవసేన సహిత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పెండ్లి కుమారుడు పెండ్లి కుమార్తెలుగా స్వామివారిలను అలంకరించారు. గణపతి పూజ ప్రత్యేక హోమాలు చేపట్టారు. అనంతరం శ్రీ స్వామి వార్ల దివ్య కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.రాయకుదురు, కొణితివాడ, మత్స్యపురి, నడపన వారి పాలెం, గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక కల్యాణ వేడుకలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో చావాకుల సత్యనారాయణమూర్తి, చవాకుల రవికుమార్, గన్నమనీడి సోమరాజు, భైరవభట్ల మురళీకృష్ణ శర్మ పాల్గొన్నారు.

ఉండిలో..

ఉండి: స్థానిక రాజులపేటలో ఉన్న వల్లీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు.అర్చకులు వల్లీ సుబ్రహ్మణ్యేశ్వరుని కళ్యాణాన్ని వేదమంత్రాల సాక్షిగా ఘనంగా నిర్వహించారు. శనివారం సుబ్రహ్మణ్యేశ్వరుని షష్ఠి వేడుకను ఘనంగా నిర్వహించారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ క్యాంపు కార్యాలయం వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



భీమవరంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ

ఉండి: మండలంలోని వాడవాడలా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉండి మండలం ఉణుదుర్రులో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి జి.సుందర్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్నార్పీ అగ్రహారంలో మాలమహానాడు సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు తొర్లపాటి భాగ్యరాజు ఆధ్వర్యంలో జనరల్‌బాడీ కమిటీ ప్రతినిధులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే వెలివర్రు,పాందువ్వ తదితర ప్రాంతాల్లోను మాల మహానాడు, కేవీపీఎస్ ఆధ్వర్యంలో వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో చిగురుపాటి రాజేష్ ,పొట్ల పరదేశి కుమార్, గుమ్మడి అమృతరావు, నందిగం నవీన్ కుమార్, కోనాల రాజేష్, నక్కా రాజశేఖర్, పొట్ల ప్రకాశం పాల్గొన్నారు.

ఆకివీడులో..

ఆకివీడు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల్ని విద్యార్థులు నెరవేర్చాలని ఏబీవీపీ మండల కన్వీనర్ పాండవ ఈశ్వర్ సాయి పిలుపునిచ్చారు. స్థానిక ప్రధాన సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఏబీవీపీ, బీజేపీ నాయకులు పూలమాలవేసి శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే జాతీయ భావాలు పెంపొందించుకుని దేశభక్తితో మెలగాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కట్రెడ్డి ఏడుకొండలు, సన్నిధి మాణిక్యాలరావు, నాగమణి, ఏబీవీపీ కార్యకర్తలు సీహెచ్ అభిషేక్, షాలెం, సుధాకర్ పాల్గొన్నారు.

కాళ్లలో..

కాళ్ల: బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీటీడీ మాజీ చైర్మన్, మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం కాళ్ల మండలంలోని కాళ్ల, దొడ్డనపూడి, ఏలూరుపాడు, జువ్వలపాలెం, పెదఅమీరం, బొండాడ, జక్కరం, సీసలి, ప్రాతాళ్ళమెరక తదితర గ్రామాల్లో వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కాళ్లలో కాంగ్రెస్ పార్టీ ఉండి నియోజకవర్గ ఇన్చార్జ్ వేగేశ్న గోపాలకృష్ణంరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి బాపిరాజు అంబేడ్కర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వేగేశ్న గోపాలకృష్ణంరాజు, బందా పండు, కనుమూరు తస్సేల్ రాజు, సోదదాసి గంగయ్య, మర్రి కృపాదానం, తాళ్లూరి రాజకుమార్, కటారి పృథ్వీరాజు, పాల్గొన్నారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం మండలంలోని మోగల్లు, కోరుకొల్లు, పాలకోడేరు, శృంగవృక్షం గొరగనమూడి, వేండ్ర, కుముదవల్లి తదితర గ్రామాల్లో సభలు, సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుండి సంజీవ్, గోడి రవిలు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటుపడాలని కోరారు. చిల్లా రాజు, రంజాల వెంకట్, ఏలూరు విజయ్, చిగురుపాటి అభిషేక్, బొడ్డే ధర్మారావు, సాదే కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో..

భీమవరం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 68వ వర్ధంతి భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జంగం మాణిక్యాలరావు, కొప్పర్తి సత్యనారాయణ,కొట్టు కుటుంబ రావు పిల్లి మునలయ్య, చిగురుపాటి రాజు, మునగాల నర్సింహమూర్తి, కొవ్వాడ రాజు పాల్గొన్నారు.

భీమవరంలో అంబేడ్కర్ వర్ధంతి

భీమవరం: పట్టణంలో వాడవాడలా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వివిధ దళిత సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ భీమవరంశాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

మాలమహానాడు ఆధ్వర్యంలో....

మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

బీజేపీ ఆధ్వర్యంలో....

అంబేడ్కర్ వర్ధంతిని భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్ర ఉక్కు, భారీపరిశ్రమశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు కాయిత సురేంద్ర, అడబాల శివ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

భీమవరంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్ పూలమాలవేసి నివాళులర్పించారు.

డీఎన్నార్ కళాశాలలో...

భీమవరం డీఎన్నార్ కళాశాలలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ జి మోజేస్ తదితరులు పాల్గొన్నారు.



ఉండి: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సుందర్‌కుమార్



కాళ్ల: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు



పాలకోడేరు: మొగల్లులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పారా లీగల్ వలంటీర్లకు దరఖాస్తుల ఆహ్వానం

తణుకు అర్బన్: తణుకు కోర్టు పరిధిలోని 7 మండలాల నుంచి పారా లీగల్ వలంటీర్లు (న్యాయసేవా సహాయకులు)గా పనిచేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర న్యాయసేవల సంస్థ, ఏలూరు జిల్లా జడ్జి ఆదేశాల మేరకు ఈ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని వివరించారు. రిటైర్డు ఉపాధ్యాయులు, లెక్చరర్స్, సీనియర్ సిటిజన్స్, సోషల్ వర్క్ స్టూడెంట్స్, అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు, న్యాయ విద్య అభ్యసించే విద్యార్థులు, ఎన్జీవోస్, రోటరీ క్లబ్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు పారా వలంటీర్లుగా దరఖాస్తు చేసేందుకు అర్హులని తెలిపారు.